## క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి



అల్వాల్ వీహెచ్‌ఎస్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్‌ఓ ఉమా గౌరీ

**మల్కాజిగిరి, మే 28:** క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో స్క్రీనింగ్ ద్వారా గుర్తించి చికిత్స అందించాలని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ ఉమా గౌరీ సూచించారు. బుధవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిత స్వచ్ఛంద సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణ శిబిరంలో డీఎం అండ్ హెచ్‌ఓ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌ఓ మాట్లాడుతూ డాక్టర్లు, స్టాఫ్‌నర్సులకు క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్ వాడకంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ మిషన్లు కుషాయిగూడ, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందజేశామన్నారు. ముందు జాగ్రత్తగా 35 సంవత్సరాల మహిళలు అందరూ పరీక్ష చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్వేత ,స్వర్ణలత ,అరుణ, రాణి ,ఎన్జీవో బాలచందర్ పాల్గొన్నారు.

## పరిశుభ్రత..ప్రజారోగ్యమే లక్ష్యం



డెంగ్యూ బాధితురాలి ఇంటిని సందర్శించి అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఎన్ వసంత

**జవహర్‌నగర్, మే 28:** పరిశుభ్రత..ప్రజారోగ్యమే లక్ష్యమని, ప్రజలు ఇంటి చుట్టు వర్షపునీరు, చెత్తచెదారం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ ఎన్ వసంత సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 10వ డివిజన్‌లో డెంగ్యూ కేసు నమోదవ్వగా కమిషనర్ వసంత సిబ్బందితో కలిసి బుధవారం బాధితురాలి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. బాధితురాలి ఇంటి చుట్టూ హైపో క్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేశామని, దోమల నివారణకు సాయంత్రం ఫాగింగ్ చేస్తున్నామని, నిల్వ నీటిని తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సందీప్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ కల్లును అరికట్టాలి

**మేడ్చల్, మే 28:** కల్తీ కల్లును అరికట్టాలని మేడ్చల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారికి తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌కు చెందిన కరమ్మోహన్ బుధవారం ఫిర్యాదు చేశారు. దేవరయాంజాల్‌తో పాటు మేడ్చల్, బండమాదారం, నాగులూరు తదితర ప్రాంతాల్లో కల్లు దుకాణదారులు కృత్రిమంగా తయారు చేసిన కల్లులో ప్రమాదకరమైన అల్ఫాజోలం, డైజోపాం లాంటి రసాయనాలను కలుపుతున్నారని తెలిపారు. కల్తీ కల్లును అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సన్మానించిన కాలనీవాసులు



టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్లను యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

# కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

**చర్లపల్లి, మే 28**: నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట హెచ్‌బీకాలనీ డివిజన్ చైతన్యనగర్ టూబీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ చైతన్యనగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ గుర్తింపు సాధించిన సందర్భంగా బుధవారం కాలనీవాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి ఘనంగా సన్మానించి మిఠాయిలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్ రూం కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరేశ్, లక్ష్మి, రమేశ్, పాల్‌రాజ్, అంజయ్య, జ్యోతి, నజీమా, రజనీ, విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**మల్లాపూర్**: తెలంగాణ రాష్ట్రసాధనలో జర్నలిస్టుల పాత్ర చారిత్రాత్మకమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదంతో తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహిస్తున్న టీజేఎఫ్ 25 వసంతాల రజతోత్సవాల సంబురాల పోస్టర్లను, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే )143 మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ అమరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్ గౌడ్ కాప్రా సర్కిల్ అధ్యక్షుడు గోపాల్ గౌ డ్, ఆధ్వర్యంలోఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు పిడికిలి బిగించి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ నాయకత్వంలో రజతోత్సవ సంబురాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి దొమ్మాటి కిరణ్ కుమార్, సత్యనారాయణ, రాజేష్ రాము శ్రీకాంత్ నరేష్ కృష్ణ శ్రీను సురేష్ నాగేంద్రబాబు మాజీ కృష్ణంరాజు హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు

**రామంతాపూర్,మే 28**: రామంతాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలల తరబడి సాగతున్న పనుల విషయంలో ఆయా కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని మధురానగర్ నుంచి వివేక్‌నగర్ వరకు ఇటీ వలే 1కోటి రూపాయలతో బాక్స్ డ్రైనేజీ పనుల కోసం అధికారులు నిధులు మంజూరు చేశారు. నెలల తరబడి పనులు సాగుతూనే ఉన్నాయి. ఇండ్ల ముందు గుంతలు తవ్వడంతో ఇండ్ల నుంచి బయటకు రావాలంటే కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిండి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ కోసం తీసిన నాలా గుంతల్లో ఇటీవల బైక్‌లు పడిపోయాయి. ఈ పనులను పూర్తి చేయడంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనబడుతుందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ నాలాపై బాక్స్ డ్రైనేజీ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో అధికారులు చెప్పడంలేదు. ఇప్పటికైనా ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని మధురానగర్, వివేక్‌నగర్ ఈస్ట్ శ్రీనివాసపురం వాసులు కోరుతున్నారు.



మధురానగర్ నుంచి వివేక్‌నగర్ వరకు నత్తనడకన సాగుతున్న బాక్స్ డ్రైనేజీ పనులు

ఈ విషయమై స్థానిక ఏఈ శ్వేత శ్రీని వివరణ కోరగా ఎలక్ట్రికల్ పోల్స్ అడ్డంగా ఉండడం , లేబర్ కొరత వల్ల ఆలస్యం జరుగుతుంది. వారం రోజుల్లో బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

**మల్లాపూర్**: మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా బుధవారం కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో హెచ్‌బీకాలనీ ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. వివిధ పార్టీల నాయకులు.



## క్యాన్సర్ బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని బాధితురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**మేడ్చల్, మే 28:** క్యాన్సర్ బాధితురాలికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బుధవారం క్యాన్సర్ బాధితురాలికి ఎల్‌వోసీని అందజేశారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన విజయేంద్రుల నాగలత కొంతకాలంగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆర్థిక లేమితో బాధపడుతున్న విషయాన్ని మాజీ మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజు మల్లారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షల ఎల్‌వోసీని వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పించారు. ఆ పత్రాన్ని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, అప్పమ్మగారి జగన్ రెడ్డి పాల్గొన్నారు.

### రాజీవ్ యువ వికాసంతో

## నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ పొట్రు, అధికారులు

**మేడ్చల్, మే 28:** రాజీవ్ యువ వికాస పథకంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టరేట్ గౌతమ్ పొట్రు అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఆర్డీవో సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ఎల్డీఎం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**జవహర్‌నగర్, మే 28:** జవహర్‌నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా చెన్నపురం యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో బుధవారం భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో నూతన కమిటీని నియామించారు. గౌరవ అధ్యక్షుడిగా కొయ్యడ వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా బాబు, రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బూడిద వెంకటేష్, కమిటీ సభ్యులుగా శ్రీను, మురళి, రాములు, మధుసూధన్‌రావు, పోచయ్య, మాధవ్‌యాదవ్, ఐలయ్య, యాదగిరి, వీరస్వామి, ప్రసాద్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ



ఘట్‌కేసర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సుగుణ బాయి తదితరులు

**ఘట్‌కేసర్, మే 28:** కాంటా వేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ యల్ సుగుణబాయి తెలిపారు. మండల పరిధి ఏదులాబాద్, మాదారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేసి కొనుగోలు కేంద్రం రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ధాన్యం కాంటా చేసిన వెంటనే రైస్‌మిల్లుకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు, కాంటాలు, తేమ మీటర్‌లను అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జిలకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొన్న వెం టనే ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలని కేంద్రం ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు ఉన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి 'ఇంటింటికీ సీపీఐ'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్.బోస్

**కాప్రా, మే 28:** ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఇంటింటికీ సీపీఐ' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ తెలిపారు. నూతనంగా ఏర్పడిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం ఈసీఐఎల్ సమీపంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో బుధవారం జరిగింది. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ.దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బోస్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ఆగస్టు 19 నుంచి 22 వరకు కుత్బుల్లాపూర్‌లో జరిగే సీపీఐ 4వ మహాసభలను జయప్రదం చేసేందుకు కార్యకర్తలను, ప్రజాబాహుళ్యాన్ని సన్నద్ధం చేసేందుకు ఇంటింటికీ తిరుగుతూ నిర్వహించే ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బోస్ మాట్లాడుతూ ఎన్నికల్లో నెగ్గిన తర్వాత పాలకులు ప్రజలసమస్యలను విస్మరించారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో మత రాజకీయాలకు కేంద్రం తెరలేపిందని, మతాల మధ్య చిచ్చుపెట్టే మోడీ ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు.

ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూ సుఫ్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిలుగౌడ్, దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, శంకర్, హరినాథరావు, స్వామి, ధర్మేంద్ర, లక్ష్మీకృష్ణ, నర్సింహులు, శ్రీనివాస్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# జయపురికాలనీలో హైడ్రా కూల్చివేతలు



రోడ్లను కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ గోడలను జేసీబీతో కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు.

**ఘట్‌కేసర్, మే 28:** ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధి జయపురికాలనీలో రోడ్లు కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. జయపురి కాలనీ సర్వే నంబర్ 559,563,566లోని లే అవుట్ లోని పబ్లిక్ రోడ్లను కబ్జా చేసి ప్రహరీ నిర్మించినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపిన హైడ్రా అధికారులు జేసీబీలతో కూల్చివేతలు జరిపారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి...ఘట్‌కేసర్ ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న జయపురి కాలనీ లే అవుట్‌లో 20 సంవత్సరాల క్రితం కొందరు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆ ప్లాట్లను ఘట్‌కేసర్‌కు చెందిన కొంతమంది రియల్ వ్యాపారులు కబ్జాచేసి వ్యవసాయ భూమి అంటూ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి రోడ్లను మూసేశారు. దీనిపై ప్లాట్ల యజమానులు మామిడి సోమయ్య, ఏనుగు రామారావు, జగన్ తదితరులు ఫిబ్రవరిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు జయపురి కాలనీ లేఅవుట్‌ను హైడ్రా అధికారులు సైదులు, బాజిరెడ్డిలు సందర్శించి విచారణ జరిపారు. అల్లాడి హరీశ్, సింగిరెడ్డి రాంరెడ్డి, బాబా తదితరులు నిర్మించిన ప్రహరీని హైడ్రా అధికారులు కూల్చివేతలు జరిపారు. మరోవైపు ప్లాట్లు, రోడ్లను కబ్జా చేసిన రియల్ వ్యాపారులు మాధవరెడ్డి, వెంకటేశ్వర రావు తదితరులు అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రహరీ, రోడ్ల ఆక్రమణలపై రేపు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడం, అక్రమ నిర్మాణాలను చేపట్టడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### హైడ్రాకు చేరిన ఏకశిల నగర్ కాలనీ సమస్య

**పోచారం**:పోచారం మున్సిపల్ పరిధిలోని ఏకశిల నగర్‌కాలనీ సమస్య హైడ్రా వద్దకు వెళ్లింది. బుధవారం జరిగిన కాలనీ ప్లాట్ ఓనర్ల సమావేశంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు శివారెడ్డి ఈమేరకు తెలిపారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశానుసారం సర్వే నంబర్లు 739 నుంచి 749 వరకు ఉన్న భూమిలో ఏర్పాటు చేసిన ఏకశిలనగర్ వెంచర్‌లో ఎలాంటి సర్వే నిర్వహించే వీలు లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ సర్వే నంబర్లలో వ్యవసాయ భూమి లేకపోవడంతో రెవెన్యూ అధికారులు ఎలాంటి సర్వే నిర్వహించరని ఆయన వివరించారు.కొందరు భూ ఆక్రమణ దారులు అక్రమంగా ప్లాట్ల హద్దురాళ్లను తొలగిస్తూ ప్లాట్లను కోనుగోలు చేసిన వ్యక్తులను భయ బ్రాంతులకు గురిచేస్తున్నారని శివారెడ్డి ఆరోపించా రు. ఇలాంటి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా క్రిమినల్ కేసులు పెట్టిస్తామన్నారు.ఇదే వెంచర్‌లో మరో 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లను,రోడ్లను మరో నలుగురు కబ్జా చేసి చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ విషయాన్ని హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి వివరించారు. తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కాలనీ న్యాయవాది జుబేర్, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్,యాదగిరి, ప్లాట్ ఓనర్లు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ జయపురి కాలనీలో కబ్జాకు గురైన రోడ్లను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు.

## విద్యా సౌకర్యాలను వినియోగించుకోవాలి



ఎంఈవో శంకర్

**మేడ్చల్, మే 28:** ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను వినియోగించుకోవాలని మండల విద్యాధికారి శంకర్ ప్రజలకు సూచించారు. బుధవారం నూతనంగా ఇన్‌చార్జి మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యా లు ఉన్నాయనారు. ఉచితంగా చదువు చెబుతూ పుస్తకాలు,బట్టలు అందజేస్తుందన్నారు. నూతనంగా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకువచ్చిన కృత్రిమ మేధ సాయంతో విద్యా బోధన మంచి ఫలితాలు ఇస్తుందని తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీధి వీధికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవలి కాలంలో పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు.

## టెక్నోలో 8 గంటల పని విధానం

### యాజమాన్యంతో చర్చలు సఫలం



చర్చల అనంతరం విజయోత్సవ నినాదాలు చేస్తున్న సీఐటీయూ కార్మికులు, నాయకులు

**మేడ్చల్, మే 28:** టైం టెక్నో కంపెనీ యాజమాన్యంతో కార్మికుల తరుపున సీఐటీయూ జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. కంపెనీ కార్మికుల డిమాండ్‌కు అనుగుణంగా పని గంటల నిర్వహించేందుకు ఒప్పుకుంది. రెండు రోజులుగా కంపెనీ యజమాన్యం బలవంతంగా అమలు చేస్తున్న 12 గంటల పని విధానంపై సీఐటీయూ ఆందోళన నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా యాజమాన్యం కార్మికులు, సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపింది. 8 గంటల పని విధానంతో ఇతరత్రా సౌకర్యాలను కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల కన్వీనర్ నరేశ్ మాట్లాడుతూ టైం టెక్నో కంపెనీ ఉత్పత్తిని పెంచుకునేందుకు 8 గంటలకు బదులు అదనంగా ఎలాంటి చెల్లింపులు లేకుండా 12 గంటల పని విధానాన్ని అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. ఇది చట్టాన్ని కాలరాయడమేనని అన్నారు. ఉత్పత్తిని పెంచుకోవాలంటే కార్మికుల సంఖ్యను పెంచుకోవాలని కానీ శ్రమ దోపిడీకి పాల్పడటం సరికాదన్నపారు. విషయాన్ని తెలుసుకొని తాము కార్మికులు తరుపున పోరాటం చేయగా యాజమాన్యం తమతో చర్చించి, 8 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు ఒప్పుకుందన్నారు. అదనపు పని గంటలకు డబుల్ ఓటీ చెల్లించేందుకు అంగీకరించిందని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లను కూడా చట్ట ప్రకారం అమలు చేయాలని కోరగా అమలుకు సుముఖత వ్యక్తం చేసిందని వారు చెప్పారు. కార్మికులు సంఘటితంగా పోరాటం చేస్తే తప్పకుండా హక్కుల పరిరక్షణ సాధ్యం అవుతుందని తెలిపారు. భవిష్యత్‌లో కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాము అండగా ఉంటామని వారు హెచ్చరించారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతారామయాదవ్ తదితరులు

**నేరేడ్‌మెట్, మే 28:** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌లో సుమారు రూ. 42 లక్షలతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సర్కిల్ అధికారులు ఏఈ దివ్యజ్యోతితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక హక్కులు కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం

**ఘట్ కేసర్, మే 28:** ఆపరేషన్ కాగార్ ముసుగులో అటవీ సంపదను కాజేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి ఎన్.సబిత ఆరోపించారు. ఘట్‌కేసర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్ ఉగ్రవాదుల కంటే భారతదేశం మావోయిస్టులను ఉగ్రవాదులుగా, తీవ్రవాదులుగా పరిగణించి ఆపరేషన్ కగార్ పేరుతో మరణ హోమం కొనసాగిస్తుందని ఆరోపించారు. ఉగ్రవాద చర్యల నుంచి దేశ ప్రజలను కాపాడే ఆపరేషన్ సింధూర్ వివరాలను ప్రజలకు, పార్లమెంటుకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, నాయకులు యాదగిరి, చంద్రమోహన్, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో దహన సంస్కారాలను అడ్డుకున్న కాలనీ వాసులు

**పోచారం,మే28ఐ** పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని 71,75 సర్వేనంబర్ల మధ్యన 28 గుంటల ప్రభుత్వ భూమి ఉంది.ఇక్కడ ఇస్మాయిల్‌ఖాన్‌గూడ గ్రామస్తులు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. దహన సంస్కారాలను నిర్వహించరాదని కోర్టు ఆదేశాలు ఉన్నా, దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారని వసంత వ్యాలీ కాలనీ ప్రతినిధి సోమరాజు ఆరోపించారు.బుధవారం ఈ స్థలంలో దహన సంస్కారాలు నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేయగా స్థానిక కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కాలనీ వాసుల మధ్య వాగ్వాదం,తోపులాట చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. వెంటనే పోచారం పోలీసులు కల్పించుకొని ఆందోళనకు దిగిన వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ దహన సంస్కారాలు నిర్వహిస్తూ శ్మశాన వాటికగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ స్థలాన్ని దహన సంస్కారాలకు ఉపయోగించకుండాకాలనీవాసుల కోసం పార్కుగా అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## భార్యభర్తల గొడవ..భార్య అదృశ్యం

**జవహర్‌నగర్, మే 28:** భార్యాభర్తల మధ్య గొడవతో భార్య అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ దేవేందర్‌నగర్‌లో అక్షయ్, భార్య రాణి, కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 27న భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రాణి(20) ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంసభ్యులు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రాణి(ఫైల్)